ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | అక్టోబరు 30, 2026 | సంపుటి : 7 | సంచిక : 125 | పేజీలు : 2

పీఎం దీపావళి కానుక పేరుతో మోసం

సోషల్ మీడియాలో చక్కర్లు.. అప్రమత్తంగా ఉండాలి : పోలీసులు

హనుమకొండ, ఆయుధం: ప్రధాని దీపావళి కానుక పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్తరకం మోసానికి తెరలేపారు. ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ పథకం పేరుతో దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు రూ.8,000 ఇస్తామంటూ వాట్సాప్‌లో ప్రచారం చేస్తున్నారు. అనుమానాస్పద వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయాలని సందేశాలు పంపుతున్నారు. నకిలీ లింక్‌ల ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. UPI ద్వారా అక్రమ లావాదేవీలు, మొబైల్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రూ.8,000 నగదు ప్రయోజనంపై వచ్చే సందేశాలను నమ్మొద్దు.. లింక్‌లపై క్లిక్ చేయొద్దని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. OTPలు, UPI PINలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు వివరాలను, ధ్రువీకరించని సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు షేర్ చేయొద్దని సూచించింది. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్, www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని తెలిపింది.

మల్లన్న సాగర్‌పై కొత్త కుట్రలు ఆపాలి

- **మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**
- **రిజర్వాయర్ కట్టను పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

గజ్వేల్, ఆయుధం: కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రాజెక్టుల భద్రతపై పట్టింపు ఉందా?అని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. లక్షలాది మంది రైతుల కోసం, ఉత్తర తెలంగాణ దాహార్తిని తీర్చేందుకు రూ.కోట్లు వెచ్చించి కట్టుకున్న మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్ట పక్కనే నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్‌లు ఎలా చేస్తారని మండిపడ్డారు. గురువారం ఆయన సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టను సందర్శించారు. అనంతరం తిప్పారం పద్ద పైప్‌లైన్ల కోసం నిర్మిస్తున్న ఇంటెక్‌వెల్‌ను హరీశ్‌రావు పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డను రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీసినప్పే, ఇప్పుడు మల్లన్న సాగర్ కట్టను కూడా బలహీనపరిచి ఈ ప్రాజెక్టును నాశనం చేయాలని చూస్తున్నారా? బ్లాస్టింగ్‌ల ధాటికి కట్టకు ప్రమాదం వాటిల్లితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. తాను స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి చూశానని, కట్ట పక్కనే పెద్ద పెద్ద గోతులు తవ్వి, పేలుళ్లు జరుపుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇది నిర్లక్ష్యం కాదు, స్పష్టమైన కుట్ర అని ఆరోపించారు. వెంటనే అక్రమ బ్లాస్టింగ్ పనులను నిలిపివేయాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్షసాధింపుల కోసం రైతుల భవిష్యత్తుతో, ప్రజల ప్రాణాలతో ఆడుకోవద్దన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతులు, ప్రజలను ఏకం చేసి బీఆర్ఎస్ తరపున భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. హరీశ్ రావు వెంట ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ నేతలు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.








నేను అలా మాట్లాడాల్సింది కాదు

- **కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి కొండా సురేఖ వివరణ**

హనుమకొండ, ఆయుధం: కేటీఆర్‌పై గతంలో కొండా సురేఖ మంత్రి హోదాలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల ఆమె వివరణ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. కేటీఆర్‌పై ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. నాడు కొన్ని నిరాధార వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందన్న సురేఖ, కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేదన్నారు. తన వ్యాఖ్యలు కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులను నొప్పించి ఉంటే చింతిస్తున్నానని తెలిపారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు.

"బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సింది. కేటీఆర్ లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం గానీ నాకు ఎంతమాత్రం లేవు. నా వ్యాఖ్యలు వారిని గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను"

- కొండా సురేఖ, మాజీ మంత్రి



బీఆర్ఎస్‌కు షాక్..

- **కాంగ్రెస్‌లోకి చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్**

హనుమకొండ, ఆయుధం:

నడికూడ మండలం చర్లపల్లి గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ బీఆర్ఎస్ పార్టీని వీడి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాభివృద్ధి కోసం సమస్వయంతో ముందుకు సాగాలని కోరారు. వీరితోపాటు బీఆర్ఎస్ నుండి బండి శివకృష్ణా, శరత్, రామస్వామి, నితిన్, సుమన్, గణేష్, రమాకాంత్ దాదాపు 20 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రపంచంలో శక్తివంతమైనది చదువు

- **లక్ష్యం ఉన్నత విద్య.. మార్గం అవగాహన**
- **గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తెలుసుకోవాలి.**
- **విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలి**
- **రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**



ములుగు, ఆయుధం: ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యేనని, విద్యార్థులు ఆసక్తితో చదువుకొని ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావు పేట మండలం పసర జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో చదువు, జ్ఞానం మనకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఎలాంటి కష్టాలు ఎదురైనా విద్యావంతులు తమ జ్ఞానంతో ఉపాధి పొందుతూ స్వశక్తితో (..: మిగతా 2 లో..)

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

- **వరంగల్ తూర్పు జోన్ డీసీపీ అంకిత్ కుమార్**
- **బొల్లి కుంట వాగ్దేవి కళాశాలలో రక్తదాన శిబిరం**

వరంగల్, ఆయుధం: సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని వరంగల్ తూర్పు జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పేర్కొన్నారు. 'పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా, వరంగల్ సీపీ ఎన్.శ్వేత ఐపీఎస్ మార్గదర్శకత్వంలో మామునూరు సబ్ డివిజన్ పోలీసులు ఎంజీఎం ఆసుపత్రి వైద్యుల సహకారంతో బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరాన్ని వరంగల్ తూర్పు జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ప్రారంభించారు.రక్తదాతలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వారు పండ్లు, పండ్ల రసాలు (జ్యూస్) ఇతర అల్పాహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ, సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే గొప్ప మానవతా సేవ అని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి అండగా నిలిచేందుకు యువత స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చి రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేష్, ఎంజీఎం ఆసుపత్రి వైద్య బృందం, వాగ్దేవి కళాశాల ఫార్మడీ ప్రిన్సిపాల్ కమల్ యాదవ్, మామునూరు, ఏనుమాముల, గీసుకొండ సీఐలు, సంగెం పర్వతగిరి, ఏనుమాముల, మామునూరు ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





టీజీ సేఫ్ ఆకస్మిక తనిఖీలు

- **9 ఆహార తయారీ కేంద్రాల లైసెన్సు సస్పెన్షన్,**
- **వ్యాపారాల నిలిపివేత, షో కాజ్, ఇంప్రూవ్మెంట్ నోటీసుల జారీ**

హన్మకొండ, ఆయుధం: టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు, వరంగల్, హన్మకొండ జిల్లా పరిధిలోని పలు మిఠాయి తయారీ కేంద్రాలు , ఆయిల్ మిల్లులు, ముడి పదార్థాల ప్రాసెసింగ్ యూనిట్లపై ఆహార పరిరక్షణ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీమతి జ్యోతిర్మయి పర్యవేక్షణలో మొత్తం 10 ప్రత్యేక బృందాలు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నాయి. 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. తయారీ కేంద్రాలలో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు, నాణ్యతా లోపాలు మరియు అపరిశుభ్ర వాతావరణాన్ని అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యానికి హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్న సదరు సంస్థలపై కఠిన చర్యలకు సిఫార్సు చేస్తూ షోకాజ్ నోటీసులు జారీ మరియు లైసెన్స్ సస్పెండ్ చేస్తూ పలు యూనిట్లను మూసివేయడం జరిగింది.

స్వీట్ల తయారీలో ఫ్లేవర్ కోసం ముఖానికి రాసుకునే 'ఫేషియల్ రోజ్ వాటర్'ను వాడుతుండటం అధికారులు గుర్తించి షాక్‌కు గురయ్యారు. చిప్స్ తయారీ కోసం నిల్వ ఉంచిన కుళ్ళిపోయిన బంగాళాదుంపలు, బూజు పట్టిన అల్లం, రూ. 9,400 విలువైన గడువు ముగిసిన ఆహార పదార్థాలను గడువు ఉన్న వాటితో కలిపి ఉంచడం కనుగొన్నారు.

ఒక సోంపు తయారీ కేంద్రంలో 5045 kgs, ఐదు లక్షల 41 వేల వందల యాభై రూపాయల విలువ గల లేబుల్ డిఫెక్ట్స్ కలిగిన , సరైనటువంటి చిరునామా వాటి వివరాలు ముద్రించకుండా అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే ముడి సరుకులను సీజ్ చేశారు. మిఠాయిల తయారీకి ఉపయోగించే చక్కెర పాకంలో చనిపోయిన దోమలు తేలుతూ కనిపించాయి. అంతేకాకుండా తయారీ కేంద్రం లోపల కుక్కలు సంచరిస్తూ, పరిసరాలను అపరిశుభ్రం చేస్తూ ఉంటే అక్కడ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లుగా అధికారులు గుర్తించారు. అపరిశుభ్రంగా పరిసరాలు ఉన్నాయి.

నీటి నిల్వ ట్యాంకులు తీవ్ర అపరిశుభ్రంగా ఉండి, తయారీ కేంద్రాల పక్కనే దుర్వాసన వచ్చే ఓపెన్ డ్రైనేజీలు ఉన్నాయి. వంటగది ఫ్లోరింగ్ జిడ్డుగా, జారుడు స్వభావంతో ఉంది.

నూనె నిల్వ చేసే ట్యాంకులు, రీఫిల్లింగ్ చేసే ఇనుప టిన్లు, స్వీట్ తయారీ యంత్రాలు పూర్తిగా తుప్పు పట్టి, దుమ్ముతో నిండి ఉన్నాయి. ప్యాకేజింగ్ మెటీరియల్‌పై బ్రాండ్ పేర్లను తప్పుగా ముద్రించడమే కాకుండా, దాదాపు 80 కిలోల తప్పుడు లేబులింగ్ మెటీరియల్‌ను (మిగతా 2 లో..)

బండ్ అభివృద్ధి పనులు వేగవంతం కావాలి

- **కలెక్టర్, బల్దియా స్పెషల్ ఆఫీసర్ చాహత్ బాజ్ పాయి**

హనుమకొండ, ఆయుధం: జిల్లా వాసులకు ఆహ్లాద వాతావరణం అందించేందుకు చేపట్టిన వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనులు మరింత వేగవంతంగా జరగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం వడ్డేపల్లి బండ్ పై క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బండ్ అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన రిటైనింగ్ వాల్, గ్రిల్స్, టైల్స్, వాష్ రూమ్, లైటింగ్, పెయింటింగ్, జిమ్, కాంపౌండ్ వాల్, తదితర పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. బండ్ కింద ఏర్పాటు చేసే ఫుడ్ జోన్స్ దగ్గర ఉండే సీటింగ్, వాల్ పెయింటింగ్, గ్రీనరి, పిల్లల ఆట స్థలం వద్ద ఏర్పాటు చేయాల్సిన అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... బండ్ అభివృద్ధి పనులలో భాగంగా ఫుడ్ కోర్ట్ కు కలర్స్ వేయించాలని, వాటి కి సంబంధించిన ప్రతిపాదనలను త్వరగా అందజేయాలన్నారు. బండ్ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేందుకు గ్రీనరీని ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ దీపాలు, వాటికి సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- **కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వేగవంతం చేయాలి**
- **అగ్నిమాపక భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి** 2 లో
- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న**





నిబంధనలు పాటిస్తేనే.. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ

- **బల్దియా కమిషనర్ టి .వెంకన్న**

వరంగల్, ఆయుధం: భవన నిర్మాణ సంబంధ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ టి .వెంకన్న స్పష్టం చేశారు. గురువారం నగరంలోని గొర్రెకుంట, విద్యుత్‌నగర్, నక్కలగుట్ట, సిద్ధార్థనగర్, గోపాల్‌పూర్, వడ్డేపల్లి ,ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ కోసం భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొలతలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019, సంబంధిత భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతి పొందిన ప్లాన్ (నక్షా) ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, టీపీఎస్‌లు ప్రశాంత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



జనగణనలో కులగణన చేపట్టాలి

- ఏఐకెఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి

హనుమకొండ, ఆయుధం: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో కులగణనను తప్ప నిసరిగా చేపట్టాలని ఏఐకెఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వల్లెపు ఉపేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ సామాజిక వర్గాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి రావాలంటే కులగణన అవసరమని పేర్కొన్నారు. హన్మకొండ రాంనగర్ సిటీ మహిళా డిగ్రీ కళాశాల లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించిన "రౌండ్ టేబుల్" సమావేశం బిఎల్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాస్ సావిత్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా వల్లెపు ఉపేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.., దేశంలో సామాజిక న్యాయం సాధించాలంటే వివిధ కులాల జనాభా ఎంత ఉంది, ఆయా వర్గాలు విద్య, ఉద్యోగాలు, ఉపాధి, ఆర్థిక వనరులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో ఏ స్థితిలో ఉన్నాయో తెలియజేసే విశ్వసనీయమైన గణాంకాలు అవసరమని అన్నారు. కులగణన ద్వారా లభించే సమాచారాన్ని ఆధారంగా చేసుకొని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అవసరమైన విధానాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు. కులగణన కేవలం జనాభా లెక్కింపు మాత్రమే కాదు.. సామాజిక అసమానతలను గుర్తించి, వాటిని తొలగించేందుకు అవసరమైన విధాన రూపకల్పనకు కీలకమైన సాధనం అని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర సామాజిక వర్గాల అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలు వాస్తవ గణాంకాల ఆధారంగా ఉండాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో కులాలవారీగా జనాభా వివరాలను శాస్త్రీయంగా సేకరించాలని కోరారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి, అభివృద్ధి ఫలాలు సమానంగా అందించడానికి, రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయ లక్ష్యాలను సాధించడానికి కులగణన దోహదపడుతుందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని చిరంజీవులు డిమాండ్ చేశారు. యం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్ రెడ్డి హంస రెడ్డి, భారత్ బచావో రాష్ట్ర అడ్వాజర్ డాక్టర్ రాజా మమ్మద్, భారత్ బచావో జిల్లా చైర్మన్ దొమ్మటి ప్రవీణ్, కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణనలో కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో కామారెడ్డి బి సీ డిక్లరేషన్, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్, వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం నాగార్జున, మాలోతు రాజేష్ నాయక్, చాపర్తి కుమార్ గాడ్గే, కేడల ప్రసాద్, మంద బద్రయ్య, మొగిలి శ్రీనివాసరావు, చీపురు ఓదయ్యా, కునురూ వెంకటేశ్వర్లు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు అనుమతుల ప్రక్రియ సులభతరం

- త్వరలో అమల్లోకి కొత్త పోర్టల్
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, ఆయుధం: గ్రావెల్ (మట్టి) తరలింపునకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)ను అమల్లోకి తీసుకురానున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమగ్ర గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేసేందుకు నూతన పోర్టల్ తీసుకువచ్చే అంశంపై మైనింగ్, రెవెన్యూ, సాంకేతిక అధికారులతో జిల్లా కలెక్టర్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా అందుబాటులోకి తీసుకువచ్చే పోర్టల్ సంబంధించిన వివిధ అంశాలను గురించి సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... నూతన విధానం అమల్లోకి రావడం ద్వారా చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, త్వరితగతిన అనుమతులు పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రహదారుల నిర్మాణం, రైతులు, ప్రజల అవసరాల మేరకు గ్రావెల్ తరలించేందుకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడమే కొత్త విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి సాధ్యమైనంత త్వరగా, సుమారు ఐదు రోజుల నుంచి వారంలోపు అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ పోర్టల్ నిర్వహణకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కొత్త పోర్టల్‌పై అవగాహన కల్పించేందుకు సీజీజీ సాంకేతిక బృందం శనివారం జిల్లాకు రానుందని తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం నిర్వహించి, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (గిర్దవర్లు), పంచాయతీ కార్యదర్శులకు విధివిధానాలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. త్వరగా పోర్టల్‌ను ప్రత్యక్షంగా వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు వాహనాల వివరాలను నమోదు చేసి, ప్రవేశ సమయం, నిష్క్రమణ సమయాన్ని పోర్టల్‌లో పొందుపరుస్తారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ అమలుతో అనధికార గ్రావెల్ తవ్వకాలు, తరలింపునకు అడ్డుకట్ట వేయడంతో పాటు, గ్రామస్థాయిలో చిన్నపాటి పనులకు అవసర మైన గ్రావెల్ పొందడం సులభతరం కానుంది. ఈ సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ ఏడి రామాచారి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఈడియం శ్రీధర్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం

వహిస్తే చర్యలు తప్పవు

- ఏబీసీ కేంద్రంలో కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు వేగవంతం చేయాలి
- అగ్నిమాపక భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టీ. వెంకన్న



వరంగల్, ఆయుధం: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టడంతోపాటు, వీధి కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను వేగవంతం చేయాలని, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో అగ్నిమాపక భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, హనుమకొండ పబ్లిక్ హెల్త్ సిబ్బంది జంతు జనన నియంత్రణ కేంద్రం పనితీరు, ములుగు రోడ్డులోని రినోవా ఆసుపత్రి, కిట్స్ కళాశాలలో విద్యాభవనంలో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఒకటో డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్, స్థానిక గృహవాసులతో నేరుగా మాట్లాడి స్వచ్ఛ ఆటోలు ప్రతిరోజూ వస్తున్నాయా, ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా అని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు సూచించారు. రోడ్డుపై ఎక్కడా చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సంబంధిత జవాన్లను ఆదేశించారు. హనుమకొండ పబ్లిక్ హెల్త్ సిబ్బంది సంతోష్ కుమార్, ఏబీసీ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, వీధి కుక్కలకు నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల ప్రక్రియను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న శస్త్రచికిత్సల సంఖ్యను మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, కేంద్రం నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్రం పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ములుగు రోడ్డులోని రినోవా ఆసుపత్రి, కిట్స్ కళాశాలలో నూతనంగా నిర్మించిన విద్యాభవనాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రతా పరికరాలు, ఇతర రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. నిర్దేశిత భద్రతా ప్రమాణాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లోపాలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఏఎఫ్ఓ రాజేశ్వర్‌రావు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ ఐక్యత సందేశంతో

5కే, 10కే వాక్/రన్

- వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్
- రేపు ఉదయం 6 గంటలకు పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభం


హనుమకొండ, ఆయుధం: సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఏక్తా దివస్-జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా ఈ నెల 31వ తేదీన 5K, 10K వాక్/రన్ నిర్వహించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 6 గంటలకు హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమై, మట్టెవాడ పోలీస్ స్టేషన్ వరకు చేరుకుని, తిరిగి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకోవడంతో ముగుస్తుంది. ఈ వాక్/రన్‌లో పురుషులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు పాల్గొనవచ్చు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి https://docs.google.com/forms/d/e/1FAIpQLSccE57AVP9ejR0HACbXeVXtcZzPKxmPXUg109DyNr3X45MQ/viewform. లింక్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

నేటి ఆవిష్కరణ.. రేపటి భవిష్యత్తు

- పల్లెల్లో ప్రతిభను వెలికితీయాలి..
- ఆవిష్కరణలకు ప్రోత్సాహమివ్వాలి
- స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే ఆలోచనలను గుర్తించాలి
- 'ఇంటింటా ఇన్నోవేటర్'పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



ములుగు, ఆయుధం: పల్లెల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, స్థానిక సమస్యలకు పరిష్కారం చూపే నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. గురువారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు అధ్యక్షతన నిర్వహించిన 'ఇన్నోవేషన్ పంచాయతీ' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి ఆవిష్కరణలే రేపటి భవిష్యత్తుకు పునాదులని అన్నారు. గ్రామీణ ప్రజలు తమ అనుభవాల ఆధారంగా దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు కనుగొనే పరిష్కారాలను గుర్తించి, వాటిని మరింత మందికి ఉపయోగపడేలా ప్రోత్సహించాలని సూచించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, చేతివృత్తిదారుల్లోని సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావాలన్నారు.
ఆవిష్కరణలు పెద్ద పరిశోధనా కేంద్రాలకే పరిమితం కావని, ప్రతి ఇంట్లోనూ కొత్తగా ఆలోచించే ప్రతిభ ఉంటుందని పేర్కొన్నారు. ఆలోచన చిన్నదైనా ప్రజల శ్రమను తగ్గించి, సమయం, ఖర్చును ఆదా చేయగలిగితే అది సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. వ్యవసాయం, నీటి పొదుపు, పారిశుద్ధ్యం, చేతివృత్తులు, రోజువారీ పనులను సులభతరం చేసే వినూత్న ఆలోచనలను గుర్తించాలని సూచించారు.
తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (TGIC) ఆధ్వర్యంలో అమలవుతున్న 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వయస్సు, చదువుతో సంబంధం లేకుండా ప్రజలు తమ ఆలోచనలను ముందుకు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలన్నారు. స్థానికంగా రూపొందించిన పరికరాలు, వినూత్న పని విధానాలు, వాటి ఉపయోగాలను గుర్తించి సంబంధిత వివరాలను సేకరించాలని సూచించారు. ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ఆవిష్కర్తలను గుర్తించడంలో చొరవ చూపాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను పరిశీలించి, వాటికి పరిష్కారాలు ఆలోచించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఉపయోగకరమైన ఆవిష్కరణలను మరింత మెరుగుపరిచేందుకు సంబంధిత విభాగాలతో సమన్వయం చేసి, తగిన మార్గదర్శకత్వం అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (TGIC) ప్రతినిధి సోహెల్, THub నుంచి అమృత, EY ప్రాజెక్ట్ లీడ్ అన్నీ విజయ్, DIC సిద్ధార్థ రెడ్డి, TGIC గ్రాస్‌రూట్స్ లీడ్ రమేష్ పాల్గొన్నారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లోని ఆవిష్కర్తలను గుర్తించడం, స్థానిక సమస్యలకు పరిష్కారాలను ప్రోత్సహించడం, వినూత్న ఆలోచనలకు తగిన మార్గదర్శకత్వం అందించడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఈ డి ఎం దేవేందర్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీవేంకటేశ్వర స్వామికి పూజలు

వరంగల్, ఆయుధం: శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం రామన్నపేట బట్టల బజార్ వరంగల్ నందు పవిత్రోత్సవ కార్యక్రమాలలో రెండవ రోజున గోవర్ధన రాఘవాచార్యులు వేద పండితులు ఆధ్వర్యంలో వారి బృందము, ఆలయ అర్చకులచే ఆరాధన, శాత్తుమురై, శాంతి పాఠం, యజ్ఞశాలలో మూలమంత్ర హవనం, పూర్ణాహుతి కార్యక్రమంలు నిర్వహించారు. కార్యక్రమంలో పరాశరం శ్రీనివాసాచార్యులు వంశపార్య ధర్మకర్త, పవిత్రు ఉత్సవ సేవాసమితి సభ్యులు, మాజీ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు శ్రీ స్వామివార్ల అమ్మవార్లకు 108 కలశాలచే అత్యంత వైభవంగా అభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.కృష్ణకోరారు.

విద్యార్థులకు సదుపాయాలు అందేలా చూడాలి

- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో



ములుగు, ఆయుధం: తాడ్వాయి మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని (MRC) ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న విద్యార్థుల అవసర వస్తువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్, వైట్ షూస్, సాక్సులు, ట్రాక్ షూస్, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, నైట్ డ్రెస్‌లు తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి నిర్దేశించిన అన్ని వస్తువులు పూర్తిస్థాయిలో అందాయా లేదా రికార్డుల ద్వారా ధృవీకరించాలని, అర్హులైన విద్యార్థులందరికీ 100 శాతం వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోక్సో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్యానెల్ అడ్వొకేట్ దండు మోహన్

హనుమకొండ, ఆయుధం: లైంగిక వేధింపుల నుంచి మైనర్లను రక్షించడానికి పోక్సో చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్యానెల్ అడ్వొకేట్ దండు మోహన్ కోరారు. హన్మకొండ జిల్లా న్యాయ సేవా సంస్థ (DLSA)కార్యదర్శి, జడ్జీ ఎన్.వెంకట హైమా పూజిత ఆదేశాల మేరకు DLSA ఆధ్వర్యంలో గురువారం హన్మకొండ కుమారపల్లి మార్కెట్ వద్ద గల ప్రభుత్వ బాలికల హై స్కూల్లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన మోహన్ మాట్లాడుతూ.. పిల్లలకు నిత్య జీవితంలో ఎదురయ్యే పలు లైంగిక అంశాల పట్ల తగిన మెలకువలను ఉదాహరణలతో వివరించారు. ఎవరో చేసిన తప్పుకు పిల్లలు బాధ్యులు కారన్నారు. 18 సంవత్సరాల వయసులోపు పిల్లలపై జరిగే లైంగిక వేధింపులకు ఈ చట్టం వర్తిస్తుందన్నారు. నేర తీవ్రతను బట్టి ఈ చట్టం కింద కఠినమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. పదేళ్లు, 20 ఏళ్ల జైలు శిక్షాలు, యావజీవ కారాగార శిక్ష, మరణ శిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. పిల్లలపై లైంగిక ఉద్దేశ్యంతో జరిగే ప్రతీ చర్యా "పోక్సో చట్టం" పరిధిలోకి వస్తుందని తెలిపారు. ఎలాంటి బెదిరింపులకు గురి చేసిన భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, నమ్మదగిన వ్యక్తులకు చెప్పుకోవాలని, హానికరమనుకుంటే సురక్షితమైన చోటుకు దూరంగా వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ సుందర్ రామ్, హెడ్మాస్టర్ టీ. భాస్కర్లతో పాటు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచంలో శక్తివంతమైనది చదువు

(మొదటి పేజీ తరువాయి..)

జీవించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, తాము సంపాదించిన జ్ఞానాన్ని పది మందికి పంచాలని సూచించారు. ఇతరులకు జ్ఞానాన్ని అందించడంలో సంతృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. పాఠశాలల్లో, బస్సులు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు, ఇళ్లు, పరిసరాల్లో ఎదురయ్యే వివిధ రకాల వేధింపులను గుర్తించేలా విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఇలాంటి విషయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు తమ రక్షణకు సంబంధించిన అంశాలనూ తెలుసుకోవాలని కోరారు.
కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణా నివారణతోపాటు బాలల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడే బొమ్మ ద్వారా 'గుడ్ టచ్-బ్యాడ్ టచ్' గురించి ప్రత్యక్షంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీజీ సేఫ్ ఆకస్మిక తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి..)

అధికారులు ధ్వంసం చేశారు. ఆహార నిర్వాహకులకు ఎటువంటి ఫుడ్ సేఫ్టీ (FoSTaC) శిక్షణ లేదు. సిబ్బందికి మెడికల్ సర్టిఫికెట్లు, వాటర్ అనాలిసిస్ రిపోర్టులు, పెస్ట్ కంట్రోల్ రికార్డులు మరియు కనీస ఆప్రాన్లు, గ్లౌజులు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. 9 తయారీ కేంద్రాలు లైసెన్సులు సస్పెండ్ చేశారు. నాలుగు షోకాస్ నోటీసులు ఇచ్చ్చారు. 1ఇంప్రూవ్మెంట్ నోటీసులని ఇవ్వడం మరియు ఒక సెంట్రల్ లైసెన్స్ పరిధిలోని ఒక తయారీ కేంద్రం కు సస్పెన్షన్ కొరకు సిఫార్సులు చేయడం జరిగింది. అనుమానాస్పద ఫుడ్ శాంపిళ్లను ల్యాబ్ కు తరలించినట్టంలు తెలిపారు. తీవ్రమైన ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలు లభించడంతో, ప్రజారోగ్య భద్రత దృష్ట్యా సదరు సంస్థల ఫుడ్ లైసెన్స్‌లను తక్షణమే సస్పెండ్ చేసి ప్రజల ఆరోగ్య నిమిత్తం ఆహార కేంద్రాలను మూసివేయడం జరిగింది. నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపేందుకు పలు ఆహార నమూనాలను సేకరించారు.
ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన లక్ష్యమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ జ్యోతిర్మయి తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

- జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల



హనుమకొండ, ఆయుధం: నవంబరు 25, 26, 27, తేదీలలో హనుమకొండ నగరంలో జరిగే ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా 4, వ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న కూడా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి ని నియమించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల హాస్టల్స్ లలో చదువుకునే విద్యార్థులకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. SMH కాలేజీ, హాస్టల్స్ కు కూడా సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విద్య రంగ సమస్యలను పరిష్కరించడంలో వెనకడుగు వేస్తుంది అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,154 కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రియంబర్స్ మెంట్ పెండింగ్లో ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకుందామంటే వారి సొంత డబ్బులు కట్టి తీసుకుంటున్నారన్నారు. ఈ మహాసభల్లో హనుమకొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా రంగ సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ రూపుదిద్దుకొని విద్యా రంగ సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తూ ముందుకు వెళ్తామన్నారు. ఈ మహాసభల విజయవంతం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించి విజయవంతం చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయి కుమార్, బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజ్, భాను ప్రసాద్, మణిదీప్, రాజ్ కుమార్, సాయి, రణదీప్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695